C

గదాయుద్ధము

శివభారతీ విద్యా పీఠము
B-198
0398
ప్రొద్దుటూరు, Y.S.R. జిల్లా

(2

A OSMB01B147

గదాయుద్ధము

(రన్నని కన్నడ కృతి)

ఖి. యం. శ్రీకంఠయ్యగారిచే నాటకీకృతము

తెనుగు సేత

గడియారము రామకృష్ణశర్మ

సాహిత్య అకాదమీ

న్యూ ఢిల్లీ

GADAYUDDHAMU—Telugu translation by G. Ramakrishna Sarma, of *GADAYUDDHA-NATAKAM*, a Kannada play by 'Sri' (B. M. Srikantiah) based on the ancient classic of Poet Ranna. Sahitya Akademi, New Delhi, 1969. Price Rs. 2.50.

© సాహిత్య అకాదెమీ, న్యూఢిల్లీ

ప్రథమ ముద్రణ: 1969

Available at :
SAHITYA AKADEMI
Rabindra Bhavan, New Delhi-1
Regional Office : CALCUTTA-29
Regional Office : MADRAS-6

ముద్రణ:
థామ్సన్ & కో. ప్రైవేట్ లి.
(మినర్వా ప్రెస్)
33, ఫ్రాడ్వే, మద్రాసు-1

వెల: రూ. 2.50

అనువాదకుని మాట

ఆంధ్రసాహిత్యమునకు కవిత్రయ మెట్టిదో కన్నడసాహిత్యమునకు రత్న త్రయ మట్టిది. ఆ మేలి రత్నములలోనివాడు రన్నమహాకవి. 'కవి-కావ్య ప్రశస్తి' లో వితని సమగ్రపరిచయ మొసగబడినది.

రన్నకవి నన్నయకు అర్ధశతాబ్దపు ముందున్నవాడు. అతని కృతిరత్నము లలో "గదాయుద్ధము" ఉత్తమజాతికి చెందినది. రన్నని రసప్రతిపాదనము, ఉదాత్తశైలి, పాత్రచిత్రణము, ఔచిత్యవివేకము, అన్యాదృశములైనవి. ఆతని మహాకావ్యమునకు సంక్షేపరూప మీ సంకలనము. 'హళెగన్నడము' లోని ఈ ప్రౌఢకావ్యము నాంధ్రీకరింప బూనుట సాహస మనకతప్పదు. ఇం డేవైన సుగుణములున్న నవి రన్నమహాకవి వనియు, దోషము లన్నియు నావనియు విన్న వించికొనుచున్నాను.

కన్నడ ప్రొఫెసర్ శ్రీ డి. కె. భీమసేనరావుగారు అనురాగమున నీ అను వాదమును మూలముతో సరిజూచి విలువగల సూచన లొసగి తోడ్పడిరి. కుల వృద్ధులు, మహాకవి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రులుగారు వాత్సల్యముతో ఆంధ్రీకరణమును పూర్తిగా విని సంస్కరించినారు. ఈ పూజ్యపాదులకు కృత జ్ఞతలు సమర్పించికొనుచున్నాను.

నా కీ అమూల్యావకాశమును కల్పించిన ఆప్తమిత్రులకును, కేంద్ర సాహిత్య అకాడెమీ వారికిని ఋణపడియున్నాను. ఈ ప్రయత్నము విబుధజనాదర ణము పొందగలిగిన కృతార్థుడ నయ్యెదను.

అలంపురము
పరాభవ-శ్రావణము

బుధవిధేయుడు
గడియారము రామకృష్ణశర్మ

2

కవి-కావ్యప్రశస్తి

మున్నుడి :

రన్నడు పరస్వతికి రన్నడు (రత్నము). అతనికి విపర్గకవితాధారతో పాటు ఉత్తమశిక్షణయు లభించినది. సంస్కృతమున, కన్నడమున చక్కని చిక్కని పాండిత్యమును సంపాదించెను. ఆకాలపు రాజోద్యోగుల, మహారాజుల ఆశ్ర యము పొంది గణ్యుడై బిరుదములను బడసెను. తన ధార్మికగ్రంథమగు "అజిత పురాణము" నందును, లౌకికకావ్యమగు "సాహసభీమసేనవిజయము" (గదా యుద్ధము) నందును తన ప్రతిభామహత్వమును చాటినాడు. "పరశురామచరితె" అను తొలి రచన మనకు లభ్యము కాలేదు. ఈ మూడుగ్రంథములు "రత్న త్రయ" మని చెప్పికొన్నాడు. అజితపురాణమున స్వీయమతమగు జైనమును ప్రతిపాదించెను. ఇందు రన్నని కవితాశక్తికి సరియైన అవకాశము లభింపలేదు. విషయముకూడ ఆ మతాభిమానము లేనివారికి అంత రుచించునది కాదు. సాహస భీమసేనవిజయమునందు అందరికిని ఆదరపాత్రమైన మహత్వపూర్ణకథ, మహావీర వాయకులు, రసావిర్భావమున కనుకూలమైన సన్నివేశములు పంప, భట్టనారా యణ, భాస మహాకవుల ప్రేరణ ఒనగూడి రన్ననిప్రతిభ పొంగి ప్రవహించి కన్నడ కావ్యప్రపంచమునందే గణనీయకావ్యరత్నముగ వెలసియున్నది. ఇందలి నాటకసంవిధానము, దుర్యోధనపాత్రకల్పన, సమయోచితభావములు, రసప్రవా హము, శైలి అద్వితీయములై యున్నవి. మెప్పించుటకు సాధ్యముకాని యెంత వాడైనను యీకావ్యమునకు వెఱగొంది యింతటికవిని, యింతటికావ్యమును వడయగల్గిన కన్నడము ధన్యమని చెప్పక యుండలేడు. "రన్నని కృతిరత్న మును పరీక్షించువాని కెన్ని గుండెలుండవలెను?" అన్న కవి హెచ్చరిక కేవ లాహంభావపూరితవాక్యము కాదని యీ కావ్యము చెప్పును.

ఈ కాలపు పాఠకులకు ఎట్టి యుత్తమకవి గ్రంథములనైన కొద్దిగ పరీ క్షించుట ఇష్టము. మనము బహుమానింపదగిన వ్యక్తి రన్నపండితుడు కాడు. రన్నశాస్త్రి కాడు. రన్నమహాకవి. సాహిత్యశాస్త్ర, ధర్మశాస్త్ర, మతసిద్ధాంతాదు

లకో కాలానుగుణముగ రుచి, శ్రద్ధ మారుచుండుట సహజము. ఒకరుచికి ఒకశ్రద్ధకు హితమైన విషయము మరొకరుచికి, శ్రద్ధకు హితము కాకపోవచ్చును. రన్నునిలోగూడ ఒకకాలమున సుందరమై మరొక కాలమున అంత సుందరము కాని అంశము లుండవచ్చును. విశ్వమునందలి మానవమాత్రుడైన యే కవిచక్ర వర్తియందైనను కుందు, కొఱత లుండవని, కళాసౌందర్యవిషయములలో తప్పు అంచనాలుండవని, తగిన పన్నివేశములన్నిటిలో కవితాశక్తి తన లక్ష్యమును సూటిగ అందుకొనెనని సాధింప బూనుట మూఢభక్తి యగును. దీనివలన ప్రయోజనము శూన్యము. చివరకు నిలుచునది అభిమానముకాదు సత్యము.

అందువలన రన్నుని పరీక్షింపుడు. రన్ననుగూడ విడువక విమర్శింపుడు. అతని కవితాశక్తి యెంతటిది? అతడు సృష్టించిన లోకమేది? దాని సౌందర్య ఘనత లెట్టివి? అతడు మూర్తులుగ తీర్చిన వ్యక్తులెవరు? వారి జీవనరహస్యములు భేదించి వారి మానుషామానుషస్వరూపముల యెంతమట్టుకు మన కన్నులకు కట్టించినాడు. ఆతని భావములు, బోధనలు, ధర్మతత్వములు యెట్టివి? అవి యెంతవరకు సర్వసమ్మతములై యున్నవి? ఉత్సాహజనకములైనవి? ఎంత దూరము మన మతనితో కలిసి పయనింతుము? ఎచట వేఱుపడుదుము? అతని కావ్యనిరూపణక్రమమేది? ఆకారమేది? ఆత్మయేది? రీతియేది? శైలియేది? కవ్వడపు బిగియేమి? సొబగేమి? ఇంపేమి? సొంపేమి? రన్నుని నిలబెట్టి ప్రశ్నింపుడు. పరీక్షింపుడు. సాహిత్యకళాప్రియులు ఆత్మతృప్తికై తాలుచెయిగి ధాన్యము నింపికొనుడు.

రన్నుడు :

ఇతడు అజితపురాణమును, సాహసభీమసేనవిజయమును, రన్నకంద మను నిఘంటువును రచించెను. అజితపురాణము చివరనున్న

‘కరమెసెదుదు రత్నత్రయ
పరికల్పదె పరిశుద్ధచరితమ్ చక్రే
శ్వరచరిత మజితతీర్థం
కరచరితం రత్ననిందె భువనత్రయదొళ్’

అను వచ్యముపలన నితడు పరశురామచరిత్ర, చక్రేశ్వరచరిత్ర లను మరి రెండు గ్రంథములను గూడ వ్రాసినట్లు తెలియును. సాహసభీమసేనవిజయమునందలి "గంగమండలచక్రేశ్వరకటకోత్తమనాయక విరచనెయి ననర్ఘ్యరత్నమాదం రత్నమ్" అను వాక్యమును గమనించిన యితని చక్రేశ్వరచరితము గంగరాజసేనా నాయకుడును, తనపోషకుడును అయిన చాముండరాయని గురించిన గ్రంథమని తోచుచున్నది. పరశురామచరిత, చక్రేశ్వరచరితములు మనకు లభ్యములు కాలేదు.

ఈ కవిని గుఱించి యితని గ్రంథములనుండి క్రింది విషయములు తెలియు చున్నవి. ఈతడు జైనకవి. బెడుగరునాడు నందలి బెళగళికి చెందిన జంఖండి లోని ముధోళ్ గ్రామమునందు సౌమ్యసంవత్సరమున (క్రీ. శ. 949) జన్మించెను. గాజులనెట్టి కులమునకు చెందినవాడు. ఇతని తల్లి అబ్బలమ్మ. తండ్రి జినవల్ల భేంద్రుడు. సోదరులు దృఢబాహువు. రేచన, మారయ్య అనువారలు. ఓడ్డ అత్తి మమ్మ. ఇతని గురువు అజితసేనాచార్యుడు. ప్రభువు చాముండరాయడు. ఈత నికి తైలపుడు (క్రీ. శ. 923–997) కవిచక్రవర్తి బిరుదము నొసగెను. ఇతడు ఆరంభమున సామంతులకడ, దండనాథులకడ నుండి తరువాత సత్యాశ్రయ సార్వ భౌముని ఆశ్రయములో అభ్యుదయపరంపరలు పొందెను. సువర్ణదండ – ఛత్ర చామర – గజాది లాంఛనముల బిరుదనెను. అజితపురాణమును శా. శ. 915 (క్రీ. శ. 993) విజయసంవత్సరమున రచియించెను.

ఇతనికి కవిరత్న, అభినవచక్రవర్తి, కవిగజాంకుశ, ఉభయకవి అను బిరుదములు కలవు.

"కవిముఖచంద్రం కవిచ
క్రవర్తి కవిరాజశేఖరం కవిరాజం
కవిజనచూడారత్నం
కవితిలకం కవిచతుర్ముఖం కవిరత్నం"

అను పద్యమునందు ఇతని బిరుదము లన్నియు పేర్కొనబడియున్నవి. తనకు పూర్వులగు కవులలో పంపని, పొన్నని పొగడి వారితో తన్ను కలిపికొని యిట్లు వ్రాసికొన్నాడు. "పంపనినుండి వాగ్విభవోన్నతి నెగడెను. అతని గుణములలో నెసగియున్న పొన్నవికి తనకు సమానులు కలరా: కవులలో కవితాగుణార్ణవుడు

(పంపడు), కవిరత్నము (రన్నడు) యిద్దరే పుణ్యాత్ములు. వీరిద్దరే కృతార్థులు" అని. ఆదిపురాణమును రచించి పంపడు ద్విజవంశధ్వజ మైనాడు. అజితపురాణమును రచించి రన్నడు వైశ్యకులధ్వజ మైనాడు. పంప, పొన్న కవులు రట్టరాజ్యమున ప్రఖ్యాతులు కాగా ఉభయకవి రన్నడు చాళుక్యమహామండలమండనుడైనాడు. (పంప – పొన్న – రన్న కవులను రత్నత్రయ మందురు.)

పంప, రన్నలు :

రన్నడు 'గదాయుద్ధము'ను సౌధమును పంప భారతమునందలి పదుమూడవ ఆశ్వాసమను పునాదిపై నిర్మించెనని చెప్పుటకు ప్రబలాధారము లున్నవి. వ్యాస భారత కథకును, పంప భారత కథకును చాల వ్యత్యాసము లున్నవి. అట్లు భేదమున్న చోట్ల రన్నడు పంపని మార్గమునే త్రొక్కెను. గదాయుద్ధ కథాభాగము స్వల్పము. అందులోని ముక్కాలుభాగము మహాభారతమున లేనే లేదు. గదాయుద్ధమున గానవచ్చు హృదయవిద్రావకములైన విలాపములకును, స్వారస్యములైన సన్నివేశములకును, సూచనలు పంప భారతమునందలి పదమూడవ ఆశ్వాసము నందే కానవచ్చును.

ఇందలి రసవత్తరములైన అనేక ఘట్టములకు పంపడు కారణమైనను, ఇందు రన్నని కరకౌశలమే విశేషము. ఒకడు సంపాదించి పెట్టిన వస్తువు విలువను గ్రహించి దానిని సదుపయోగము చేసికొని అభివృద్ధి నొందించికొనుటకును సామర్థ్యము కావలయును. ఒన్నడు పంపకవి ననుసరించెనని అందరు అంగీకరింపవలసినదే. ఇందువలన నేమిహాని? పంపనినుండి రన్నడు గ్రహించి యుండవచ్చు నన్న అంశ యెంతయని లెక్కవేసినచో సుమారు పదమూడు, పదునైదు పద్యములు, అయిదు వచనఖండములకంటె యెక్కువ ఉండజాలదు. వచనములు గాక సుమారు 575 పద్యములున్న గదాయుద్ధములో ఇత డనుకరించిన భాగ మెంత స్వల్పమో సహృదయులు గ్రహింపక పోరు. అల్పమగు యీ అనుకరణభాగము మీదనే రన్నని కీర్తిస్తంభము నిలిచి నట్లగునా? ఈ భాగమును తీసివేసిన గదాయుద్ధము తన సహజసౌందర్యముచే రాణింపదా? పూర్వకవి భావామృతకోషమునకు రన్నడే కాదు సకలభాషాకవులును పాల్పడియున్నారు.

గదాయుద్ధనాయకుడు :

గదాయుద్ధకావ్యమునందు దుర్యోధనుని చరిత్ర యెట్లు తీర్చబడినదో భీమసేనుని చరిత్ర ఆస్థాయిలో తీర్చబడలేదు. భీముడు యుక్తాయుక్తవివేకశూన్యుడై సాహసమునకు గడంగు ఆవేశమూర్తిగ మాత్రమే మనకు తోచును. అతని ఉదాత్త గుణములను చిత్రించుటకు కవికి తగిన సందర్భములే లభింపలేదు. దుర్యోధనుని చరిత్రను కవి చాల సుందరముగ చిత్రించినాడు. ఉదాత్తమానవోచితములైన అతని గుణములకు నివాళుల నిచ్చినాడు. చివరకు జయలక్ష్మి భీమసేనుని గళమున పుష్పదామమును వైచినను, దుర్యోధనుని ఉదాత్తతను మన కట్టెదుట నిలిపి అతడు పరాజితుడు కాకుండిన బాగుండెడిదని, ఓడినను వేల దొరలచు పగవానిచే తన్నులు దిని ప్రాణములు వదలు దుర్దశ రాకుండ వలసినదని అనిపించునట్లు మన సానుభూతిని కవి దుర్యోధనునివైపు మరల్చును. ఈ కావ్యమునందు భీముడు మొదటి నుండి చివరివరకు మనకు ధీరోద్ధతుడుగ మాత్రమే కానవచ్చును. కాని దుర్యోధనుడు అటనటి ధీరోద్ధతావధులు దాటి ధీరోదాత్తుడుగ గనపడును.

మొత్తముమీద కావ్యలక్షణము, సంవిధానరీతి, వ్యక్తిప్రాధాన్యము, రసపోషకత్వములనుబట్టి కౌరవుడే పైచేయిగా నున్నాడు. భీమసేనుడు మనదృష్టిలో నల్పకాలమే యుండును. ప్రస్తావనారూపమైన ద్రౌపదీభీమసేనుల సంవాదము, దుర్యోధనుని వెడకుచు గాంధారీధృతరాష్ట్రుల ప్రవేశము, ప్రతిజ్ఞానిర్వహణోత్సుకతను వ్యక్త మొనరించు పీఠికాపద్యములు, వైశంపాయనసరోవరసమీపమున దుర్యోధనుని తిరస్కారము, గదాయుద్ధము యీ సందర్భములందు మాత్రమే భీమునిమనము దర్శింతుము.

దుర్యోధనుడు మొదటినుండి చివరవరకు మన లక్ష్యమునందుండి వ్యక్తివైశిష్ట్యముచే మన సానుభూతిని సంపాదించికొనును. అతని ఉదాత్తతను దర్శించిన మనము సింహావలోకనముగ ప్రస్తావింపబడిన అతని దురాగతములను విస్మరించెదము. దుర్యోధనుడు మడిసిన విదప వేజీసంహారము, భీమకృత ద్రౌపదీసౌందర్యవర్ణనము, ద్రౌపదీభీమసేనుల పట్టాభిషేకము, పాండవుల అభ్యుదయములు కొనసాగినవి. కాని మనము వానిలో చేరము. దుర్యోధనుని ఊరుభంగ, మకుటభంగములచే దుఃఖతప్తులమైన మనము భీమసేనుని పట్టాభిషేకము నెట్లు చూడ

గలము. తొడలు విటిచి మకుటమును తన్నిన భీముడు క్రోధాగ్ని కురిపించుచు, అవహేళనగ దుర్యోధనుని దుర్గతిని ద్రౌపదికి చూపించునపుడు తాలిమి కట్టలు తెగి దుఃఖము పేరమీటి బలరాముడు ద్వారవతికి పోయినట్లే మనమును యెచటికో వెడలిపోయెదము. ముంచేమి జరుగునో తెలిసికొను కుతూహలముగూడ ఉండదు.

గదాయుద్ధము – విషాదాంతనాటకము :

మహాభారతమున లేని కొన్ని ఘట్టములు రన్నని కావ్యమున కానవచ్చును. వానిలో ముఖ్యము లేవి యనగా దుర్యోధనుడు తన అపజయమునకు ఖిన్నుడై ద్రోణాశ్వత్థామలను దూషించుట, సంజయుడు వారి కర్తవ్యపాలనమును కొనియాడి భీమార్జునుల పరాక్రమమును ప్రశంసించుట, దుర్యోధనుడు కృష్ణభీమాదులను నిందించుట, గాంధారీధృతరాష్ట్రులు యుద్ధభూమికి వచ్చి పాండవులతో సంధి చేసి కొమ్మని బోధించుట, దుర్యోధనుడు యుద్ధభూమిలో ద్రోణ, అభిమన్యు, లక్ష్మణ, దుశ్శాసన, కర్ణాదుల మృతదేహములను చూచి ప్రలాపించుట, భీష్మునికడకు పోయి అతని హితవచనమును తిరస్కరించుట, బలరాముడు వచ్చుటకు వైశంపాయన సరోవరమున దాగియుండుటకు అంగీకరించుట, అశ్వత్థామ లక్ష్మిని దూషించుట, చివరకు భీముని పట్టాభిషేక మగుట యివి మహాభారతమునందు లేని మట్టములు.

రన్న డీఘట్టములను మనోజ్ఞముగ నిర్వహించినాడు. ఈ మార్పుల వలన గదాయుద్ధకావ్య దుర్యోధనుడు షేక్స్పియర్ మహాకవి వ్రాసిన విషాదాంతనాటకముల వాయకుని కొంతవఱకు పోలుచున్నాడు. నాటకకర్తలలో అగ్రగణ్యుడైన షేక్స్పియర్ మహాకవి రచించిన విషాదాంతముల సంవిధానమును పోలునట్టి కథాసంవిధానమును ఎన్నో శతాబ్దములకు ముందే రన్నమహాకవి కూర్చినాడని చెప్పవచ్చును.

గదాయుద్ధము చంపూకావ్యమైనను దుఃఖాంతమైన మహానాటక మనదగియున్నది. అందలి చివరి దృశ్యమే దుర్యోధనుని మహిమాంచితమరణము. ఈ కవి కులశిరోమణి మనల దేశకాలాతీతులను గావించి కాల్పనికరాజ్య స్వప్నమార్గమున వైశంపాయనసరోవరతీరమునకు తరలించుకొని పోయి నిల్పును. కన్నులు దెఱచి చూచిన శతాబ్దాలనాటి వీలాకాశము, శతాబ్దాలనాటి పవిత్రతమ రమణీయవాతావర

ణము, వనావృతబంధురకమలాకరము, పశ్చిమగగనాంగణమున పునుగుచున్న రవి దుఃఖసూచకమైనను, కాంతిమంతములైన పంజకెంజాయలను వెదజల్లు చున్నాడు. ద్వాపరయుగములోని శాంతిపూరిత సంధ్యాకాలము. సామాన్యముగ సాయంసమయము మౌనవ్రతావలంబియైనను, వైశంపాయనసరోవరతీరమున ఎన్నడు, ఎచ్చటను లేని నిరతిశయ నీరవత. ఇదేమి: సరస్తటమున కోమల వల్లీవృక్షములు విటిగి పడియున్నవి. కారుచున్నలు పోరాదె ననుటకు పీలులేదు. ఎందును గెల్తైల గుర్తులు కానరావు. తీరమునందలి పచ్చికపరుపు త్రొక్కిడులకు లోనై వాడువాటి యున్నది. చూపటి వెంటనే మానవుల పాదచిహ్నములను. పచ్చికను ఎరుపు చేయు రక్తమును చూచి చకితు డగును. ఇతడెవరు: తీరమునం దొకచోట ఊరుభంగ, కిరీటభంగముల పాలై నేలబడి కొనయూపిరి పీల్చు చున్నాడు. అతడే కౌరవమహానుభావుడు. అతడే కురుకులచక్రవర్తి. కవిపుంగవు డగు ఆర్యరన్నడు మనల కొంతముందచటికి గొని పోయి యుండిన కురున్మపాలని దుర్గతి మనకు విస్మయజనకము కాకుండెడిది.

దైవసంకల్పమును మీరువారెవరు? వైశంపాయనహ్రదమున కురుకుల స్వామి దాగియున్న సంగతి బైటపడి పోయినది. ఏ భీముని వెదకుచు మొదట తానే వెళ్ళియుండెనో ఆ భీముడు బైట నిలిచి సీత్కారము చేయుచుండ గురువచన విర్భంధముచే లోననుండి క్రోధావేశపూర్ణు డగుచున్నాడు. సహనము మేఱ మీరి వది. అభిమానధనుడగు దుర్యోధనుడు మొఱటు భీముని తిరస్కారములను పహించి లోన నొదిగి యుండునా? క్షాత్రతేజోమూర్తి యుద్ధభీరునివలె మడుగున విల్చుట తగునా? గురువాక్యపాలనకై మడుగు జొచ్చినను, క్షాత్రధర్మపాలనకై మడుగు వెడలెను. పంపమహాకవి యీసందర్భమున చెప్పినట్లు "కరిడలభగర్జ వకు లేచిన మృగరాజువలె రాజరాజు నైరింపక చిత్తస్థలనమునే జలస్తంభన మంత్రము మాయమంత్రము కాగా, గదాదండమును భుజాదండమున నవరించి లజ్జాకరస్థితిని వదలి వెలికి వచ్చెను." గదాయుద్ధ మనివార్య మైనది. దైవసంకల్ప మీడేరినది. ఇచటి సన్నివేశమంతయు దురంతచ్ఛాయచే కృష్ణవర్ణము దాల్చెను. ఈ కృష్ణవర్ణచ్ఛాయలో దుర్యోధను డొక్కడే శౌర్యతేజఃపుంజమై ప్రకాశించు చుండెను. ధర్మదేవత అధర్మనీలాచ్ఛాదనమును కప్పుకొని అధర్మదేవత ప్రక్కన చేరియుండెను. రాజ్యలక్ష్మి దుర్యోధనుని అంతఃపుర బహిర్ద్వార దేహళిపై నిలచి

చంచలదృక్కులతో రణభూమిని చూచుచున్నది. ఈ పరిసరమందు చలింపక పరమేశ్వరుని పంచముఖములవలె పంచపాండవులు నిలచియున్నారు. ఎదుటి అనుజితతమును కోల్పోయి రౌద్రావేశముతో నిండి అందరిని యుద్ధమున కాహ్వానించుచున్న సాహసమల్లుడు, ఏకాంగవీరుడు దుర్యోధనుడు. ఆసమయమున జంగమహిమాచలమువలె యెంతో నిరీక్షించిన బలరాముడు వచ్చెను. ఇప్పుడైన దైవబలమునకు తిరస్కారము జరుగునా? అని మన నిరీక్ష. దుర్యోధనుని నమస్కారము, బలరాముని ఆశీర్వాదము. చివరకు చావుకు జంకక రోషదుఃఖములచే నిండి శౌర్యమూర్తియై దుర్యోధనుడు నిలిచియుండుట యివన్నియు ఒకదాని కొకటి సహాయకములై దురంతపరిణామముల పరాకాష్ఠదశను ప్రదర్శించును. మానవుడు నిస్సహాయుడు. ఎవరున్నను ఏమియు చేయునట్లు లేదు.

శైలి :

రన్నని శైలి వీర్యవంతమగు శైలి. అంతటి శక్తిని మఱొకశైలిలో దర్శింప నెంచినచో మనము పరసాహిత్యములకు ప్రయాణము కట్టవలెను. మన కవు లొకరిద్దరిలో శబ్దాడంబరము యథేచ్ఛగా లభించును. కాని శబ్దాడంబరము శక్తి కాదు. శక్తికి కారణభూతమైన వాగ్వైభవము ఒక రన్ననికే యొనగూడినది. ఇతర కవులు ఇంపు, మాధుర్యము, సౌకుమార్యము, లఘుఘాటి మొదలైన గుణము లను శ్లాఘాపాత్రములుగ ప్రదర్శించియున్నారు. ఆ గుణములు రన్ననికి ఆవశ్యకములు కావు. దుర్యోధనుని దర్పము – దుర్యోధనుచలము – దుర్యోధనప్రతాపము అట్లే భీమకోపము – భీమప్రతిజ్ఞ – భీమసేనాడంబరము వీనికి సమన్వయమగు శైలికి లాలిత్యపు ఊసేల? "స్థిరబద్ధమచ్చరర్ – భీకరబద్ధభృకుటిఘటితర్ – అద్భుతర్ – ఆట్టాసురర్ – అధికకోపపాటలపరుషేక్షణర్." అతని పాత్రలు "గదగదెయుం ఘట్టిసె పుట్టిద కెంద కిడిగళ్." యివియే పదములు. "కైనడు గదె గదెయుం తిరువువ బెడంగు" వద పరణి "ముడుపం బెన్నం కొరళం నడు నెత్తియ నెత్తిపొయ్య రొర్వర నొర్వర్" అన్నదే పదఘాటి. ఈ శైలీసామర్థ్యమును వేఱు పదములచే వర్ణించుట అసాధ్యము.

రన్ననిశైలి రూపకానుగుణ శైలి.

(క) అందు పదబాహుళ్యమునకు అవకాశమే లేదు. అభిప్రాయములకు సంగ్రహమై, బిగియై, సరియైన వాణి లభించినది.

(ఖ) ఆద్యంతము భాష సంభాషణారూపము నందున్నది. రవ్వని పద్యము లను మార్పు లేకుండ నాటకమున నుపయోగించ వచ్చును. అవిధముగ నుపయో గించి పరీక్షించి యుండుట కన్నడభూమికి వేద్యము.

(గ) పాత్రల గుణావగుణములు, ధైర్య. దర్ప, శోక, చిత్తక్షోభాదులు వారు పలుకు మాటలచే, చేయు పనులచే, వ్యక్తము లగును కాని కవి వర్ణనలచే కాదు. ఇది రూపకప్రధాన లక్షణము.

(ఘ) నాటకమునకు క్రియయే జీవము. గదాయుద్ధము వేరువకు తగినట్టు క్రియచేతనే పరిపూర్ణ మగును.

(చ) రన్నడు గూఢవిషయమును గూడ మూర్తిమంతముగ చిత్రించును. అవ్యక్తవిషయ మాతనికి పరిపోదు. ఇదియు రూపకమునకు ముఖ్యధర్మము.

(ఛ) కాష్ఠము లొండొంటిని రాచికొని మహాగ్నిని రేపునట్లు కవి పదములు రాగోద్రేకముచే నొండొంటి నొఱసి రసపుష్టిని చేయును. ఈవిధమగు పద వంయోజనము రూపకమునకు సరియైనది.

శ్రీ కవిరత్న-రన్న

రసికులలో చెన్న కవిజనులను రన్న
విశదవిజ్ఞాన సంపన్నుఁ
వసుధేశ సభా కవిపండిత వంమాన్య
కుశలకవి రన్నుఁ ఓ ధన్యుఁ

సాహసభీమని సాహపవర్ణన
ఊహింపగ కన్నడసీమ
ఆహవమల్లుర మీరిన సాహసో
త్సాహవర్ణనే రన్నడు కాదేఁ

ఒకటవ రంగము

(కృష్ణుడు, భీముడు, ద్రౌపది ప్రవేశింతురు)

కృష్ణుడు : కం॥ శ్రీరమణికి నెలవుగ తన
పేరురముఁ సల్పనెంచు విధమున సమర
ప్రారంభమునకు భీముడు
కౌరవకుల సర్వనాశకరుడు కడంగెఁ.

మ॥ కురుభూభృద్వలతూల కాలపవనుఁ, క్షోణీంద్రగంధేభకే
సరి, దుశ్శాసనరక్తరక్తవదనుఁ, సమ్రాణ్మహోరుక్షమా
ధరవజ్రుఁ, కురురాజరత్నమకుటోత్పాటాంఘ్రిసంఘట్టనం
గరునిఁ, నేను నుతించెదఁ రణయజ్ఞకామునఁ భీమునిఁ.

ద్రౌపది : వర్ణింపుము : వర్ణింపుము. వీర్యములేని కథలో వర్ణనయైన వలదా ?

కృష్ణ : వింటివా భీమా ! నొచ్చి పలుకుచున్నది చెల్లెలు.

భీమ : పహాజము.

కం॥ కురురాజానుజ భీకర
కరములు తన నీలకబరికాభర మీఁద్వఁ
పరిభవ మందిన కృష్ణకు
ద్ధారకొనవే కోప తాప దుస్సహబాధల్.

ధర్మపుత్రుడు వైరాగ్యపరుడు.

కం॥ ధాత్రిని మరి యీ పాపక
పుత్రికనే గాదు జూదమున నోడుట ఆ
క్షత్రియతేజమునే యమ
పుత్రుం డానాడు శత్రువున కోడండే.

ఆయన తమ్ములము మేము.

కం॥ పరవశతం బడిపోయిరొ ?
పరార్జితప్రాణు లైరొ పాంచాలి నటుల్
పరిభవము సేయుచుండగ
దరమే కనుచుండ పవనతనయ నరులకు.

తం॥ వినయమ్ము నెదుట విక్రమ
మును దలపము నడునిమాట పోనిమ్ము ననుగ
ఘనమంత్రాక్షర ముగ్దుని
నొనరిచినది అన్న సూనృతోక్తియ సుమ్మీ.

ద్రౌపది : ప్రియము నా కీ పశ్చాత్తాపము. సాహసభీమా ! సత్యాశ్రయా !

చ॥ దనుజవిరోధియే సలుప తప్పునె సంధియు నీవు నేము చే
సిన సుకృతంబు లట్టి వవశిష్టసుయోధన మయ్యె నేన కాం
తనవకుప్రదుల్ పలుక ధర్మజు డిప్పుడు సంధి కొగ్గునో
యని మది పంశయించెదిని ఆద్భుము శంకను కౌరవాంతకా !

కం॥ ఖలదుశ్శాసనరక్త
స్థలోత్పతత్కృష్ణరక్తజలమున కోపా
నల మాటిపోవ నీవును
గతితోష్మద వట్టు లకట గన్పడైదవే.

కం॥ క్షమసూపి శత్రువులయెడ
యమసూనుడు సంధికొగ్గు డనెనేని అర
ణ్యమె మీకు శరణ్యం బ
గ్నిముఖోద్భవ నగుట నాకు నెరవౌ నదియే.

భీము : సుయోధనప్రణయకాళీ ! పాంచాలీ !

కం॥ జారిన కచభారముతో
ఊరిన కన్నీటితోడ నుత్తలపడుచున్
నారీ ! నీ విటులుండగ
కౌరవనాశకుడు వీడు గళితాగ్రహుడే.

కం॥ కురునందనులను దునిమితి
కురుపాంసను ననుజు నల్ల గ్రోలితి రెంటన్
జరితార్థుడ నీ తక్కిన
మరి రెంటిని దీర్చి పగను మాపగలేనే.

కం॥ ఊరుల విటిచెద తన్నెద
కౌరవపతి మకుట మురలగా వేణీసం
హార మొనర్చెద నీగతి
భారము తీర్చెదను నాదు పరిభవమునకున్.

కం॥ మన ధర్మజు డడుగును శాం
తనవుడు గావించు సంధి తప్పు దను వగన్
బనిచేమి ? అన్నమా ట
ట్లనుచుడుము తాతయె కడంగ నొప్పరికింపన్.

ద్రౌపది : చం॥ ఇజీవదెడంగచేవ పరమేశ్వర సాహసభీమ ఆజి ని
న్నొయు బెదిరించుచున్ ద్రుతక నోర్తురె నీదు భుజాగదాహతిన్
పటీయలు వాని క్రుళ్ళిన శవాలయి భూతగణాలవిందులై
తటిగిన గొట్టె లైన రిపుతండమె పల్కు భవత్ప్రతాపమున్.

కం॥ ఒడలును తొడవులు రెండున్
చెడునట్టివి చెడని సొమ్ము చిరయశ మొందే
చెడు నొడలు తొడవు లిడి మరి
చెడని మహోదనము గొనగ చింతింపగదే.

కం॥ మజీఢచిత ప్పర్ణవిభూ
షణములకే వలతురొక్కొ చానలి కృష్ణ
వ్రణముల నీవలె పురుషులు
గుణములు మెరయించి పేర్మి గొంద్రతిభీమా!

కృష్ణ: లెస్సగ మూడలించితివి. ఇంక ధృతరాష్ట్రి డెక్కడ? గాంగేయు డెక్కడ? పంధికార్య మెక్కడ? దుశ్శాసనాదుల నొక్కడు దక్కనూర్వర నతిఘోరముగ నుఱుమాడెను. శేషించిన ఆదుర్యోధను నొక్కని గెల్చితో, గూల్చితో మనదొర కేమిగహనము. అహా! రౌద్రావతారిణి! దేవాసురయుద్ధమునకు కరగల మెత్తిన డామరడాకినీ!

కం॥ కురుకులమును క్రమింగితి వికమరి కొందఱు క్రమింగ నుంటి మహీపతితోడన్
మరియొక హిడింబిరక్కసి
మరలన్ నిన్నెచట తెచ్చె మనవిభు డౌరా!

భీము: ఈమె నా ఆరాధ్యమహాశక్తి. ప్రియా!

కం॥ నే ననిలనందనుడ వై
శ్వానరసుత వీవు మనము జితగూడిన ఇ
చ్చో నెట్లు సంధియగు నన
లానిలయోగమున భగ్గు మనదే పగయున్.

కం॥ కుపురుషజీవాకర్షణ
పరిణత మిది కాలహస్తపాశమ యగు నీ
శ్వరి కేశహస్త మగునే
పరాభవజ్వలనకృష్ణపటలము కృష్ణా!

కృష్ణ: భీమసేనా! ఎఱుగుదువుకదా! దుర్యోధనునకు మైత్రేయు డొసగిన శాపమును. నేఁడు భానుడుండగా పగతుని పరిమార్పకున్న ఇంకెన్నడును దునుమలేవు. రేపు బలరాముడు వచ్చి కలియ నున్నాడు.

భీము : కృష్ణా ! చింతింపకుము.

కం॥ సత్యప్రతిజ్ఞ దన కురు
పత్యూరుకీటభంగ పరిణద్ధయశ
స్తుత్య కృతార్థత బడయక
పత్యాశ్రయ బిరుదు నాకు సార్థకమగునే.

రమ్ము యాజ్ఞసేనీ ! నీ కార్యము తీరినది.

(నిష్క్రమణము)

రెండవ రంగము

(దుర్యోధనుడు, సంజయుడు)

దుర్యో : సంజయా ! నాదుఃఖము హృదయమే యెఱుగును.

మ॥ అరిసైన్యంబు నొకండె దున్మునని రుద్రాంశం దటంచుఁ వెతల్
నురుముఁ త్ర్యంబకుడంచు సాకితిని తానో తండ్రియో పూన్కిమై
శరసంధానము చేతురంచు నిటు శస్త్రత్యాగముఁ చేతురే ?
అరయం జాలరె నేవ్యనేవకత నౌరా ద్రోణుఁడుఁ ద్రౌణియుఁ !

కం॥ ఈయగ చంపగ రక్షిణ
నేయగ క్షత్రియులె మఱి భుజించెడి తఱి నో
హో యన నాపదలం ద
య్యో యనగా గాక చంపనోపుదురె ద్విజుల్ ?

కం॥ కరవాలము నటికినయటు
మరవాలము నరుకగలదె మహి వీరవరుఁ
భరియించిన తోడ్పడు నుప
కరించునే పంద పటికి కదనమువేళఁ.

సంజ : (ఆత్మగతము) ఱంకను గురుదూషణమా ! మఱెందుకో.

కం॥ కౌర్యసఖుండంట శకుని
శౌర్యసఖుండంట సూతజాతుడు భీష్మా
చార్యుల నుడి తప్పట దు
ష్కార్యం దహి కేతనునకు కర్మవళమునఁ.

(ప్రకాశముగ) కురురాజా ! గురువుల శరాసారము నీవే చూచితివి.

కం॥ కలళనదీజులు భక్తికి
కలళం బిడినట్లు పోరు గావించిరి వా
రల శక్తి మీరె నెవ్వరి
కలవియగుఁ క్రీడిశౌర్య మరయవె సీవ్రఁ.

కం॥ బికునిఁ, హిడింబునిఁ, కీ
చకునిఁ, కిమ్మీరదనుజు సమయించెను వా
నిక జీల్చె జరాసంధుని
సకలదముతు పవనసుతుడు సామాన్యుండే?

కం॥ పవనేంద్రజుఁడు గదాగాం
డివము ల్గొన నెదిరి ప్రతిఘటించెడి వీరుల్
భువనముల కలిగిరే పాం
డవభుజవిక్రమము నూతనంబె నృపాలా?

వీరుండనిమ్ము. భరతకులశిరశ్శేఖరుడు ధర్మపుత్రుడు తన ధర్మబలమున
ఉన్నచోట గెలువడే?

కం॥ దానము ప్రియవాక్సహితము
జ్ఞాన మగర్వంబు శౌర్యసహితక్షమయుఁ
గానము భువి సమకూడెను
దానజ్ఞానక్షమాళి ధర్మజునందుఁ.

దుర్యో: ఉండుము. ఉండుము సంజయా.

మ॥ స్థిరమై సత్యము ధర్మముఁ దయయు సుశ్రీ పొల్చువాడీ యుధి
ష్ఠిరు దంచెల్లరు బల్కఁ కీర్తి నళియించెఁ కార్ముకాచార్యునిఁ
గురునిఁ బ్రాహ్మణు కల్లలాడి శిరముం గోయించునాడే మృషల్
పరమాఘుండనరే పృథాసుతుడు పాపాత్ముండు గా కన్యుడే?

చం॥ అనుజుడు కొప్పు బట్టి సభ కంగన నీడ్చిననాడు వీరుడ
య్యెనొ? భగదత్తు నేస్గు కుడియె మ్మగలించివనాడు వీరుడ
య్యెనొ? ఇనజుండు చంప కదలించి వదల్చిననాడు వీరుడ
య్యెనొ? కురుదాలురం దునుము నింతకె మారుతి వీరు డయ్యెనే?

మ॥ పెనుజూచంజున సోదపత్ వనితయుం బెంపేదగా భృత్యుడై
వనిలో వల్కలధారియై, తపసియై భర్గుడ మహోగ్రంబు గో
రె నటుండై మటి పేడియై విరటు నారీలోకముం గొల్చె కృ
ష్ణుని బంధుం డత డద్దిరా! త్రిజగతీశూరుండె కౌంతేయుడు?

మ॥ సభలో నా యనుజుండు తాము గన పాంచాలి మహాపంచవ
ల్లభనుం బట్టగ రెప్పలార్పని కనుల్గా జూచు శౌర్యాఢ్యు లి
ప్పు భళీ యందురె? ఈపరాక్రమము నాటోపంబు పీవీర్య మీ
సుభటాలాపము లెల్ల వారి కపుడెచ్చో శూన్యమై పోయెనో?

విడువుము, చాలింపుము. అనిష్ఠాగ్యుల నేమని యందము?

మ॥ గురునిన ప్రోజ్ఝితచాపు నైతవమునం గూల్పించు నైపుణ్యమున
కరకయ్యాగతు జేసి తాత నొగిలించన్నేర్పు రాధేయునిన
విరథజ్యాయుమనైన చంపగల దోర్వీర్యంబు కౌంతేయు లొ
క్కరె నేర్వంగలవారు సాహసధనుల్ కౌరవ్యులా న్నేర్తురే?

ప్రొద్దుపోవుచున్నది, నడువుము. భీముని చూపుము.

సంజ: రాజరాజ! స్వామిహితము పల్కదును. క్షమింపుము. ఈ మూర్ఖత్వము వలదు. పాండవులు అనుకూలదైవులు. నీకు దైవము ప్రతికూలము కదా!

దుర్యో: మూర్ఖసంజయా!

కం॥ సమరజయము దైవా
ధీనమగుట సమరంబు శూరధర్మము కాదే?
యమనందనాదుల నో
క్కమొగంబున నోర్చి చలము కడముట్టింతున.

మ॥ సురసింధూద్భవ, కుంభజన్మ, దినకృత్పూన్యాదులుఁ గూలి సం
గరమం బెట్లు జయించు? పాండవులి నీ కౌరవ్య దేకాకి యం
చెఱుగంజాలని లోకమేమనినగానీ ఈ గదాదండ ము
ద్ధురదోర్దండయుగంబె చాలు రణమందుఁ తోడు కాంక్షింతునే?

పంచ: అభిమానధనా! ఛలదంకమల్ల! ఏకిని నిరాకరింతువు? శ్రీకృష్ణుడు మహావిష్ణువు.

కం॥ పవనసుతుండు మహారథు
డవనిప సమరథుడపీ వనాలోచిత మా
పవనజుతో నని విడు బి
ద్ధవైరముఁ సంధిసేత తగినది నీకుఁ.

చుర్యో: కృష్ణుండట! భీముండట! దేవుండట, భూతంబట!

మ॥ పురుషు ల్మావ్వర నొక్కఁడందు రసురవ్యూహమ్మునం ద్రాజిగ
ద్ధురుడం ద్రన్యులకేల తేరు నడుపఁ? కుంతీతనూజాతకిం
కరు డేలయ్యె? భయార్తుడయ్యె పలుకంగా నొప్పు సూతుండు కిం
కరుడుం కాతరుడంచు నొప్పుఁనొకొ నా కంసారి దైవంబనఁ?

కం॥ తనకుఁ మత్స్యాదికముల్
మునుపయ్యె దశావతారములు చాలవె అ
ర్జును తేపదోలు పదునొం
దనదగు సూతావతారమా ఇది హరికిఁ?

ఆతని ఆంతర్య మడిగెదవా చెప్పెదను.

కం॥ అనుజను పార్థున కిడి యా
తని సుతునకు బిడ్డనిచ్చి తనియక కొంతే
యని తేరు నడిపి తానా
తని పేరున నేలజూచు ధర్మజు నవనిఁ.

పి భీము డొక్కడు.

కం॥ ఘనబలయుతు నను సమరథు
డనియు నతిరథునిగ మఱి మహారథుగా భీ
మని బిల్కితివిగదా ఆ
తని రథచక్రంబు లంత దళపరిగిరులో ?

కం॥ పరులం బొగడెదు నన్నుఁ
వరకుంగొన వల్పుజేసి సంజయ నీవుఁ
మఱియొక ద్రోణాచార్యుడు
మఱియొక భీష్ముండుగాగ మది దలచెదవో ?

వంజ : (ఆత్మగతము)

కం॥ ఎంతెంత ఢిద్దకొడగిన
నంతంతగ నైజ మధికమయ్యెడు నీ భూ
కాంతుని యందున కటుగా
భ్రాంతక్ష్మాన్యాచ్ఛవంశ మట్టిది కాదే ?

(ప్రకాశముగ) ఫణిరాజకేతనా ! యుద్ధమునే నీవు కోరునెడ అశ్వత్థామ కలడు, బలరాముడు కలడు. వారిలో నొకరికి సేనాపత్యాభిషేకము చేసి పైరుల సాధింపుము.

దుర్యో :

కం॥ మినువాక పట్టిచే తీ
రని కర్జము పిదప నా కలశజునిచే తీ
రని కర్జ మినజుచే తీ
రని కర్జము ద్రౌణిచే దిరంబుగ నగునే ?

కం॥ ద్రోణుడు చేసిన మేలే
ద్రోణజుడుంగూడ జేయదొడరెడు సమర
క్షోణిం దదాశ తీయుఁ
బ్రాణము విషముష్టి చిగురు, పండొక మెకదా ?

కం॥ హలినిఁ రణకేళికుతూ
హలినిఁ నమ్మితి నతండు నాహవకోలా
హలమందు తీర్థయాత్రా
ఛ్ఛలమున తన జనులలోఁ చని రాఁకుండెఁ.

కం॥ మఁచివెడు రిపు లర్కఁజూచే
మఁదియుదు తట్లు శూరుఁడైన మా తమ్మునిచే
మఁదియుదు రఁట్లే నాచే
మఁదియుదురేగాక ఒరుల మగటిమి నగునే?

కం॥ కాసివ ద్రోణ నదీ
పూన సమిన్మరణఁజాత శోకోద్గత బా
ష్పానీకపుఁ జను నేనే
వేనాపత్యాభిషేకపిద్ధిని గండుఁ.

ఆయ్యో! సంజయా! సంజయా!

కం॥ నా కిరువురు నిరు భుజములు
నా కిర్వురు రెండు కనులు నా యువరాజుఁ
నా కర్ణుడు లేనపుడిక
నాకేటికి బ్రతుకు రణమె నను గదలేర్చుఁ.

కం॥ మఁదినెను దినకరతనయుఁడు
మఁదినెను దుశ్శాసనుండు మా తమ్ముండుఁ
గడిదేరు వీరు లభయులు
మఁదియగ దుర్యోధనుండు మనుటయుగలదే?

కం॥ మనసిటు శూన్యము నాకుఁ
మనవీడుఁ శూన్య మాఁజీమహీయుఁ సకలా
వని శూన్య మయ్యె దుశ్శా
వనకర్ణులా లేక బ్రతుకు సాగించెదనే?

(తెరలో)

సేవకుడు : ఇటు, ఇటు మహారాజా!

సంజ : హా! కష్టము, కష్టము! కుమార సుయోధనా, సహింపుము, సహింపుము. వృద్ధమాతాపితరులు వెదకుచు నీయున్న యెడకు వచ్చిరి. వారి చరణారవిందవందన మాచరించి మహారాజు హృదయక్షిత మూరువట్లు పలుకుము.

దుర్యో :

కం॥ బాంధవుల గూల్చి సరసిజ
బాంధవ తనయానుజాళి బలిగొని నేసీ
అంధనరేంద్రుని మొగమున్
గాంధారి మొగంబు నేమొగంబున గాంతున్?

మ॥ అరిభూపాలుర నుక్కడంచి జయతూర్యధ్వానముల్ నింద సో
దరులం బుత్రుల మిత్రులం గలిసి మోదంబొప్ప దర్శించు సం
బర మిట్లయ్యె విధాత! మద్గురు సంతప్తాత్ములన్ శోకత
ప్తరులన్ బాష్పజలాభిషిక్త తనులన్ దర్శింపగా జేసితే!

కం॥ అన్నా! నీ సోదరు లెం
దున్నారని జనని యడుగ నొగి యేమందున్?
చిన్నారి తమ్ములను బలి
గొన్నా రల పార్థులంచు కుమిలించెదనే?

హా! దుశ్శాసనా! హా కర్ణా! (మూర్ఛపోవును)

సేవకుడు : ఇటు, ఇటు మహారాజా!

ద్రుత : కం॥ ఒడయడు పడియునొకండై
పొడవగు నక్షోహిణులకు భూమిపతులు వెం
బడి గొల్వ గొల్వులో వెలి
గొడుగుల దగు నిన్ను వెదకికొనుచే తనయా!

నేప : తల్లీ : కార్యము చెడినది. ఇదిగో : మహారాజు పాదములు కౌగలించి కొని సంజయుడు విలపించుచున్నాడు.

ధృత : కం॥ హా : కురుకులచూడామణీ :
హా : కురుకులచక్రవర్తి : హా : పకలధరి
త్రీకాంత : నిన్ను విధి పర
లోకంబున కనిపెనే ఖలుడు కోపమునన్.

గాంధారి : కం॥ మృగధరకుల సంపల్లత
నెగడగ పసు లెవరు : నీవె నిలిచితి ప్రాపై
తగిలి లయకాల భీమో
రగ మురగపతాక : నిన్ను గ్రసియించెనొకో :

ఆ॥ వె॥ మాకు నంధయష్టి మాడ్కి నుంటి వొకంద
వున్నచాలు నంద రున్నయట్లై
అట్టి నిన్ను కౌరవానిమిత్తరిపుండు
యముడు చంపె సార మురనె నేమొ :

కం॥ గురుచరణంబుల కెరగక
పరమాశీస్తతిని ప్రీతి బడయక మౌనం
బు రహిం బూనుట ఉచితమె
గురువినయము మరుతు వొక్కొ కురుకులతిలకా :

కం॥ మదిసిన దుశ్శాసనుదే
నుతులనెనో చన్నికొడుకు నొచ్చినయెడ యే
నుడులనె దుష్కర్ణుం దే
నుడులనెనో మాకు దెలుప నోచవె పుత్రా :

పుజ : తల్లీ : విలపింపకుము. కర్ణదుశ్శాసనాదుల చావుతో శోకోద్వేగము నొంది మూర్ఛ నంచినాడు ; ఇప్పుడే లేచును.

దుర్యో : (లేచి) నమస్కరించుచున్నాడు నిర్భాగ్యుడు.

గాంధా : నాయనా ! బ్రతికియున్నావా ?

ద్రుత : మహాదృష్టము. నీక్రూరవిధి శాంతించుగాక !

వంజి : అందుకు తగిన శాంతి గూర్పవలె పెద్దలు.

ద్రుత : వత్సా ! సుయోధనా ! యుద్ధప్రసక్తిని మానుము.

కం॥ శ్రీవనితకు నిజవిజయ
శ్రీవనితయె సవతిగాగ రిపున్నృపులఁ జౌ
ర్యావిష్కృతి బొరిగొనెడు జి
యావసధ మసాధ్యు దాజి ననిలాత్మజుడుఁ.

తత్మపుత్రుడో ఇంకను ప్రేమాస్పదుడై యున్నాడు.

చం॥ యమజుడు మేలనేయు మన కన్న ! ఒడంబడు మింక సంధికిఁ
పమకురజేయ నంపెదను సంజయు భీమునితోడ గొన్న ద్వే
షము విడు మాత్మజానుజవిషాదము సైచు మొసంగు మర్ధరా
జ్యము మనవారి కన్న ! నిమ నంధవితఁ పద మంటి వేడెదఁ.

గాంధారి : కం॥ పరిణతకాయుల మంధుల
మిరువురముఁ మమ్ము దన్పుటే యుచితంబౌ
గురువాక్యంబున కొడబడు
గురువచన మలంఘ్య మంద్రు పుణువంశనిధీ.

కం॥ సమరవ్యాపారము మా
నుము సుత ! నీ శిబిరమునకు నొవ్వక చనుమా
పమనిన పుత్రులు సమసిరి
మను గావగ చాలుదీవ మటి వచ్చెదరే ?

ద్రుత : కం॥ వీరశతజనని కీ గాం
ధారికి దుఃఖశతజనని నామం బబ్బెఁ
గౌరవపతి దుఃఖమహా
భారవహోయాసమునకు పాత్రుఁ కతనఁ.

ఈమె నోదార్చుట నీ ధర్మము. చలమున వేమగును: నీ తమ్ములగతి
జూచి, తమ తమ్ముల దలచి ధర్మజుడు సంధి గోరుచున్నాడు. నీ వంగీక
రించుటే తడవు సంధి జరుగగలదు.

సంజ : యుక్తమిది. నీ తండ్రిమాటలు పాటింపుము.

దుర్యో : మీ పూర్వపక్షమే మాకు సిద్ధాంతము.

మ॥ తన తోబుట్టిన తమ్ములం దొకడు యుద్ధక్షేత్రమం దీల్గినఁ
తన ప్రాణంబుల నగ్ని కిత్తునని ఆ ధర్మాత్మజుం డాడడే
ఘనులౌ నూర్వురు నా సహోదరులు ప్రమగ్గ న్నేను జీవింతు వం
చను మిథ్యాకలు వీపు దెల్లరకు నేరై పోయె నాకౌ వడే.

కం॥ సాధింతు క్రీడినుండియు
సాధించెద భీము జీల్చి సర్వుల హా: క
ర్ణా: దుశ్శాసన: తీసెద
సాధింతు నఘోషి యమజు సహజీవనముఁ.

గీ॥ తమకు నేనె సుతుండనె: ధర్మరాజు
సుతుడు గాడొకొ, మీరును నతడు గూడి
పొరపులే లేక సుఖముగా పూర్వమట్లు
బ్రతుకు డిక నన్ను దయచేసి వదలరయ్య:

ధృత : నీవు చూత్రము మామాటలు గైకొనక వైరమునే పూని పాండవుల
పాధింప సున్నావు. సంధి కొడంబడకున్నను నీవు మా కింతైన మేలు
నేయుము. ఇకపై జరుపదగు కార్యమును నీ తాతతో నాలోచించి
జరుపుము. ఇదొక్కటి చేయుము.

దుర్యో : మహాప్రసాదము.

మూడవ రంగము

(పిశాచములు – పంజయుడు – దుర్యోధనుడు)

పంజ : భయంకరము, రణరంగము. అదిగో :

కం॥ శవభక్షక తండంబులు
శవములకై తిరుగుచుండె సమరావనిలో
నవకాళ మీక తమపతి
శవరక్షణ నేయు సుభట సంఘము లిచట.

ఇటు చూడుము.

గీ॥ ఇంత లింతలు జేసి ఈ యేన్గు శవము
నంతయును తామె అపుడప్పు డారగింప
దలచి పెఱికిక, తినక నాకలి దపించి
సంచరించెడి లబ్ధపిశాచగణము.

దుర్యో : ఇదేమి : ఈ పిశాచములు మనచుట్టు మూగుచున్నవి.

1వ పిశాచి : అక్కా : దుర్యోధనుడు :

2వ పిశాచి : ఏది నీది ద్రౌపదీద్రోహీ : నీది :

3వ పిశాచి : పీకై ఆకలితో నున్నాము.

1వ పిశాచి : గురుని నెత్తురు గ్రోలదు మన్న అతడు బ్రాహ్మణుడు.

2వ పిశాచి : పీ తమ్ముని నెత్తురు ద్రాగుదుమన్న భీముడు పీల్చెను.

3వ పిశాచి : భీష్ముని వేడినెత్తురు పీచ్చెదుమన్న ఇంకను చావలేదు.

1వ పిశాచి : కురురాజా : నీ నెత్తురు చవిజూచుటకు నోరూరుచున్నది.

1 వ పిశాచి : ఊరుభంగ మగును ఉండుము.

పంజ : కర్ణకఠోర మీ పిశాచవాక్యము.

దుర్యో : ఛీ ! పిశాచిమాటలు సత్యము కాదు.

2 వ పిశాచి :

చం॥ అమరిచి లక్కయింటిను విషాన్నమునఁ దునుమాడ నెంచి వై
రము నిటు బెంచి భీము సమరస్థలికిఁ గొనితెచ్చు నీవు ద
య్యమవొ ? పిశాచకోటులు రణావని గొల్వ చరించు నేను భూ
తమునొకొ చూత మిర్వురను దయ్యము లెవ్వరొ నాగకేతనా !

దుర్యో : పంజియా ! ముందుకు, ముందుకు.

2 వ పిశాచి : పలుకకుండ పోపీయను.

1 వ పిశాచి : పోయినచో ద్రౌపదియాన.

3 వ పిశాచి : మీరిపోయిన వీరభీముని యాన.

1 వ పిశాచి : పంజివరకె నీయాట.

(దుర్యోధనుడు గదము ధట్టించును : పిశాచములు పాఱిపోవును)

పంజ : మహాపత్యా ! ఈ దయ్యములతో నేమి ? విజయము చేయుము.
అక్కటా !

చం॥ వినుతవిరోధిమాండలిక వేష్టనమార్జిత పాదపీఠ కాం
చన కమలాయమానములు స్వామిపదంబులు భిండివాల నూ
తన కరవాలఖండములు తండములై పడియున్న సంగరా
వనితలమందు మోపి నడువఁ బరమేష్ఠి ఘటింపజేనెనే !

దుర్యో : పంజియా ! కన్నీరు దుడిచికొనుము.

కం॥ తనుజానుజుల వియోగమె
మనమును నొప్పించదయ్యె మఱి యీ పమరా
వని లోహఖండములు బా
ధను గూర్చునె? వజ్రికఠినతరచిత్తునకుఁ.

నడువుము. నా ధైర్యమును కలంచకుము.

సంజ: పీరెవరు? ఆచార్యులా?

దుర్యో: ఆచార్యా! కోపమున దూషించితిని.

చం॥ అరయమె చాపనైపుణిని ఆ నరుడేమి? పినాకపాణి యే
ర్తెర నిను దాకి గెల్వగలడే యవిలో నిది పీయుపేక్షయో?
ఒరనిన మూడు కర్మఫలమో అరయఁ మఱి వీకు మృత్యువే
తెఱుగున సంభవించె? గురుదేవ! మహారథ! కుంభసంభవా!

సంజ: ఇదిగో అభిమన్యుడు.

దుర్యో: కం॥ అసమబల! భవద్విక్రమ
మసంభవము పెరకు నిన్ను నర్థించెద మా
కొసగుము కుమార! నీ సా
హసైకదేశాత్త మరణ మాహవమందుఁ.

(చేతులు మోడ్చును)

సంజ: మహారాజా, ఇటురాకుము, ఇటురాకుము.

దుర్యో: చూచితిని, లక్ష్మణకుమారుడుకదా! వత్సా!

కం॥ జనకునకు జిలాంజలినిఁ
తనుజాతుం డొసగు టొప్పు తప్పిన దది నే
డొనగూడె నీకు నేనిడ
తనయా! విధినేత క్రమము దప్పించెగదే!

సంజయా, దుఃఖములో దుఃఖము, చూపింపుము దుశ్శాసనుడెక్కడ? కర్ణు డెక్కడ?

సంజ: ఇదిగో, అనుగుదమ్ముడు.

దుర్యో:

మ॥ అసువు ల్వోరొక లోకమందున పిశాచాస్యంబునఁ మాంసముల్
వెసరక్తం బరికుషీలో తల సురద్విట్ఫాణిలో చారుగా
త్రసుమంబుఁ కురుభూమిలో నిలిపి గాండారీజ! దుర్యోధనా
ప్త! సహోదర్యుడ! భీము భీమగదచే పంచత్వముఁ బొందితే?

మ॥ జనసీస్తన్య మొకండె కాదు మఖదీక్షాసోమముఁ దివ్యబో
జనము ల్గొన్నపు డేను ముం దవల వత్సా! సీవుగా నుంటిమే.
వినయోల్లంఘన చేయమే మరణ మీవే ముందు గైకొంటివే?
అనిలో వెన్కయి నిల్పికోనయితి వత్సా అగ్రజత్వార్హతఁ.

గీ॥ భ్రాతృరక్తంబు గ్రోలిన వాని నల్ల
జీవసహితంబుగా బీల్చి చేవమిగిలి
రహి సుయోధన నామ పార్థక్య మెసగ
కడగి తమ్ముని కసిదీర్ప గలనె నేను.

ఈ తెగిన కళేబరమును చూడజాలను, నడువుము.

సంజ: (ఆత్మగతము) ప్రియసఖుడు, కర్ణుడు రాజరాజునకు సమస్తదుఃఖము నినుమడింప జేయును.

దుర్యో: హా కర్ణ!

కం॥ సీవును, నేనును, తమ్ముడు
మూవురె దిట్టల మతండు పోయిన పిదపఁ
బీవు న్నే నుంటిమి ఇపు
డీవుఁ నను పీడి చనితివే అంగపతీ!

కం॥ నీ వృషసేనుడు మఱియుఁ
నావాడగు లక్ష్మణుడు రణంబున చావఁ
నీ వోదార్పగవలె నను
నీవగపు స్దీర్పనుంటి నే నంగపతీ.

కం॥ అరయం జాలను నీయా
తెఱగు న్నాకేల ? మొగము త్రిప్పితొ అథవా
మఱుమాటాడవు రవినుత
మఱిచితివో నన్ను బడలి మ్రాన్పడినావో ?

గీ॥ చెలిమికాని సుయోధను చేరి చూడ
వేమనవు కౌగిలింప వింకేల దుఃఖ
మనవు మర్యాద చూపి " దేవా, నరేంద్ర "
అనవు బదులాడ వేలయ్య అంగరాజ ?

గీ॥ నీవు గల దేళమున నిల్వనేర్చునేమి ?
అన్యతభయలోభములు కర్ణ ! త్యాగసత్య
శౌర్యగుణములు రాజిల్లు సజ్జనముల
న్‌గగణ్యుండవై యుంటి వంగరాజ !

కం॥ నే నెఱుగుదు పృథ యెఱుగును
దానవరిపు డెఱుగు పద్మదయితుం డెఱుగఁ
జ్ఞాని సహదేవు డెఱుగును
నీ నిజమును పరు లెఱుంగనేరరు కరా !

కం॥ తన తోబుట్టని యెఱిగిన
ఇను జేయదె నిన్ను నప్పుడే ధర్మజుడుఁ
నిను రాజు జేయలేనై
తిని నా యొడయనిగ దలచితిని అంగపతీ !

కం॥ నీవున్న నుండు రాజ్యము
నీవుండిన పట్టముండు నెగడును ఛత్రం
బీవున్న నుండు పీఠం
బీవుండక ఉండ దేదియే వంగపతీ :

కం॥ కనులందును, హృదయంబున
కనబడు నీరూపు నాకు కర్ణంబులలో
వినిపించు నీదు వాక్యము
లిననందన నీవియోగ మెక్కడిదయ్యా :

కం॥ విను జంపిన పార్థుండును
అనుజుని దునుమాడినట్టి అనిలజు డేనుఁ
మనియుంటి మిప్పటికి భవ
దనురాగాస్మత్కృతజ్ఞతాంతర మిదియే.

కం॥ ఇనజుని దుస్థితి దుఃఖ
సను దుర్గతి జూచి ఇంక చన వసుషటి నె
ట్టిన నాకు తాతిగుండియ
తనమున నెన్నాళ్లకు ప్రాతుకు దాల్పగ వలెనో.

కం॥ సూనులు పోయిరి ప్రియమి
త్రానుజులున్ పోయి రోవిధాతా ! ఇంకే
హీనస్థితి గనజేతువో ?
ఈ నీచుని పాపకర్మ నీ నిర్భాగ్యఁ.

అయ్యో ! పంజియా !

గీ॥ ఎవరితో ప్రీతి బలుకుదు వింక నెవరి
గూడి కొలువుందు నెవ్వరితోడి విందు
లారగింతును నాయన్గు లేరు లేక
ఎటుల భద్రాశ్వగజముల నెక్కువాడ ?

వం॥ చెలి కసుమోషమయ్యె మతి చేకుర దభ్రువిమోషముఁ ధరా
తల మతదిచ్చె నేను తిలతర్పణ మింక నొపంగ వన్యమం
దలమున శౌర్యవహ్ని దహనం బొనరింపగ సీత డీతనిఁ
జ్వలితము కాష్ఠవహ్ని నిడిజాలన కర్ణున కేమొనర్చితిఁ ।

వంజ : దేవా ! కర్ణునింక మరువుడి.

కం॥ తరుణులు పఱపించునటుల్
పురుషులు విలపించుచుంట పోలనె ఘనమే ?
మతి కార్య మెవరు దీర్తురు
కురుభూషణ పగను దీర్చి గుతి మతిచెదవే ?

దుర్యో : కం॥ దరహాసితముఖుడు సురకుం
జరగమనుడు మేరుశైలసమతేజుడు ధా
న్యకిసుతుని రూపు నిలిచెను
విచిత్రచిత్ర మటు చిత్తభిత్తికయందున్.

మం॥ ఆగు దీక్షావిధులందు సద్గురుడు మంత్రాంగంబునఁ మంత్రియౌ
జగతీరక్షకు స్వామి నర్మసఖు దిష్టక్రీడలందెల్ల నే
వగు భారంబున కాజి యోద్ధ పటుశూరాగ్రేసరుండుఁ పదా
నగవు ల్జిలెక్కడు మిత్రు కర్ణు మఱువ న్నాకుం దరం బౌనాకో !

వంజ : రాజరాజా ! శరశయ్యపై భీష్ము డిచట నున్నాడు. విజయము చేయుము.

దుర్యో : కురుపితామహా ! బాలుడు నమస్కరించుచున్నాడు.

పంజ : (చెవిలో) పితామహా. ఏ మనుమడు, కురుకులాంబరద్యుమణి దుర్యోధ
నుడు విచ్చేసినాడు.

భీష్ముడు :

చం॥ ధవళగజేంద్ర చామర వితానకముల్ ధవళాతపత్రముల్
ధవళవిలోచనా శతశతంబులు గొల్వ నిశాంతరంబులఁ

ధవళిత కీర్తిగేయ వినదంబులు పర్వగ వేగుదెంచు కా
రవధవకుండు నార్తి గదురక పరదేశిగ వేగుదెంచెనే ;

ఏకాకివై వచ్చిన పి రాత్రితో సమరవృత్తాంత మంతయు నవగతమయ్యెను.

దుర్యో : తాతా, నన్ను గూర్చి దుఃఖింపకుము.

చ॥ వినయము పీడి మీరు గురువృద్ధులు పల్కు హితోపదేశముల్
మనమున లేశముంచ కిటు మారుతివై చలమూని ఇంద్రసం
దను సమయింప వైరమును దాల్చి కడంగితి విట్టి పాపక
ర్ముని కతనం ఘటించె విడుము ల్కడు మీకిటు సిందునందనా.

భీష్ముడు : కుమారా, కావలసిన దైనది. వృథా సంతాపము వలదు. ఇక నా మాటలు వినుము. పాండవుల నొడబరచి, సంధికుదిర్చి పూర్వక్రమము జరుగునట్లు చేయుదును. వాడు నేను చెప్పునట్లు విందురు. నీవును నామాట విని క్రతుక వేదెదను.

దుర్యో : కం॥ మిము గాంచి జోతలిడిపో
సమకట్టియె వచ్చినాడ సంధి పరులతో
సమకూర్చగోరి రా వికి
సమరహితం బేదొ తెలుపు వయ్యన తాతా.

కం॥ వసుధకై కాదు పోరుట
కనికై పాండవులతోడ కలహించెద నీ
కసుమాలపు టిల కర్ణుని
కనిమిషగెను దీని నేను కాంక్షించెదనే ;

కం॥ నా దైదూతులు వారలు
వేడిన నీకుండ నేడు నే సగబాలుక్
వేడి మనదూత నంపిన
కాడింపరె పవనసుతుడు గర్హింపడొకో !

మ॥ ఆకసౌనే ? వహటీవనం బరులతో సీసంది చేకూరునే
అకటా ! సీవు. గురుండు లేక చెలియౌ నాకర్ణుడు న్లేక మా
మకసోదర్యులు లేక నేరికయి ఈ భ్మమండలం బేలుదు ? ?
సుకము ల్పంపద లేరితో గుడిచెద ? శోభావిహీనంబుగా.

క్షమించుడు. నా దుఃఖము చల్లారదు. అఖండితమయిన అభిమాన మొక్కటే మిగిలినది. దానినే బలివెట్టెదను.

భీష్ముడు : పంజయా, పొమ్ము గాంధారీధ్రుతరాష్ట్రులతో నిట్లు చెప్పుము. మనుమడు నాపల్కుల కొడంబడడు. ఆతని సత్వము, ఏకాంగసాహసము ఆశ్చర్యకరములు. మానధనుడగు నాతని మనము బాధించుట తగదు అని. కుమార ధైర్యము వహింపుము. తీర్థయాత్రల నుండి బలరాముడు రేపు రానున్నాడు. ఈ యొకదినమే మైత్రేయశాపమున నీకు గల గండము. ఇందుకు కాలవంచనమే మంత్రము. వైశంపాయన సరోవరమును జొచ్చి, ఈరాత్రి గడవి రేపు నీయదృష్టము చూచికొమ్ము పొమ్ము.

దుర్యో : మహాప్రసాదము (పోవుచు)

కం॥ బలియుర పాండవు లవ్వా
రలతో యుద్ధంబు సల్పరా దిక సంధిన్
సలుపుట మేలను పెద్దల
పలుకులు విన కర్ణములను బ్రహ్మ యొసగెనే !

కాసారములో కాలవంచనమా !

కం॥ దినకరతనయుని దుశ్శా
సనుని వియోగమున కింత సంకటమును బొం
దను శిరము ముంచి జలమం
దునికికి విలపింతు తాతఉపదేశమునన్ !

కానిమ్ము. భీమునితో సంధి కాకుండుగాక.

నాలుగవ రంగము

(కిరాతకులు వెదకుచు పోదురు. భీముడు, ధర్మరాజు,
కృష్ణుడు ప్రవేశింతురు)

భీముడు : ఎచ్చట అడంగె నా ద్రౌపదీద్రోహి ?

మ॥ పదరై పోయెను పూర్వ్ యెల్ల సభలో పాంచాలరాజాత్మజా
వదనమ్లానత మాన్పలే దికను మదాహూత్త కండూతి తీ
రదు కొంచెం బెపుడీ సుయోధనహతుల ప్రాణంబులం దీయగ
ల్గాదు నంచుఁ మది యుత్తలంబడెడు మూర్ఖుం డాత డెందుండెనో ?

కం॥ రస జొరదారెనొ ? నాలుగు
దెసలం దేమూలనే నొదిగెనో ఖలుడీ
వసుమతిలో విధిచాలక
వెస జొచ్చెనొ తల్లికడుపు వెరపున మరలఁ.

కం॥ చర మచర మనెడు జగదం
తరమున ఖలు డెందు దూరినఁ తద్భుజపం
జరమున నున్నను హరిహర
పరమేష్ఠుల నెదిరి వాని ఐట్టి వధింతుఁ.

మ॥ చతురంతక్షితికాంత ! ఓజలధి ! ఓసప్తార్చి ! ఓతంద్రి మా
రుత ! ఆకాశమ ! వీనులార వినుఁ ద్రౌద్రోహాత్మ కోపాగ్ని కా
హుతి జేతుఁ దునుమాడ లేనియెడ నత్యుగ్రాగ్నికిఁ నేనెయా
హుతి నౌదుఁ కురువంశ నాశకుడ భీమోద్దాముడఁ పల్కెదఁ.

ధర్మరాజు : భీమా ! ఈ కోపోద్రేకము తగదు.

భీముడు : ఓహో ధర్మ్రశవణము !

చ॥ కులపతి ముక్తకేశయయి పోరవిషాదము నంద గాంచుచుఁ
చలనముఁ బొంద మేను ననుజన్ముఁ డీవు దయావిదూరశఁ
కలతను బొంద వింత యపకార మొనర్చిన వైరిభూజముఁ
నిలువున గూల్చి దుఃఖముల పీగెద మింక సహింప శక్యమే ?

కం॥ ఈనా డొకండు నేనుఁ
గాను విధేయుండ మీరు కా రగ్రజు లు
ర్వీనాథ ! విడువు డీకురు
సూనుని బడజీల్చి చంపి సూడుం దీర్తుఁ.

గీ॥ ముంగురులు బట్టి యీడ్చి నాముండె ద్రుపద
పుత్రిని పరాభవించిన ముష్కరుండు
వీరిచే నెందు దూరిన విడుతు నొక్కొ ?
కురుపతిని చంపకయె వెను దిఱుగగలనె ?

కృష్ణుడు : భీమా ! మాటలచే కార్యముకాదు. సూర్యుడు వాలుచున్నాడు. ముం
దరయుదము రమ్ము.

భీము : ఓహో సైనికులారా ! కురుక్షేత్రములో కురుపతిని వెదకవలసి వచ్చెను.
ఆహాహా ! !

మ॥ ధృతరాష్ట్రాత్మజు దర్కసూతిపసు డాదిక్కామినీనాథుడుఁ
కృతకద్యూతజితార్జునానిలజు డాక్షీప్తార్యవాక్యుండు సం
హృతకృష్ణాంబరకేశు డాత్మజమహాహృత్తాపసంతప్తు డు
ద్ధతుఁ డేమూల నడంగె మీ కురుకులోద్యద్రాజ దేవేంద్రుఁడుఁ ?

కం॥ భరతకులేందుకళంకుఁడు
భరతాన్వయరాజభవన వాయస సముడుఁ
కురుకేతు డెందు గల డా
కురుకులలయకేతు భీమకులమణి వచ్చెఁ.

(తెరలో)

కిరాతులు : అడుగులు, అడుగులు !

భీముడు : ఎక్కడ ? అడుగులెక్కడ ? (పోదురు)

అయిదవ రంగము

భీముడు : ఎచ్చట ? ఎచ్చట అడుగులు ?

కిరాతకులు : ఈ కొలనుగట్టుమీద.

భీముడు : వానివే ! వెలువడిన అడుగులు.

కృష్ణుడు : ఇది ఆకవటి తంత్రము. భీష్ముని కాలహరణమంత్రము. లోన నుండును. కొలను ముట్టడించి వెలువరింతము.

(కిరాతులు వాద్యములు మ్రోయింతురు)

ధర్మరాజు : భరతాన్వయమున కిది లజ్జాకరము.

కృష్ణ : ధర్మప్రియా ! రాజ్యలక్ష్మి అసహ్యముతో వదలినట్టివాడు.

గీ॥ గోవులను బట్టె, ద్రౌపది కురుల నీడ్చె,
గొప్పలను బల్కె, భీతిచే కొలను దూరె,
పరుల బాధించు నీతని పాడిపనులె
చాటు కౌరవ రాజ్యావసాన కథను.

ధర్మ : కం॥ అంకితుఁడు బలిమి కురుహరి
ణాంకుఁడు దుర్యోధనాంకుఁ డనఁబడి అయశ:
పంకమున నీ సరోవర
పంకంబున డాగియుంట ధార్యం బగునే ?

కృష్ణుడు : కం॥ మానధనుండవు నీ వది
మానహతి జేతువే ? క్షమానాథ యిటుల్
ఈ పీట ఎంద్రి యుండును,
మీనంబులు, కప్పలుండు, మేల్మగ లుండ్రే ?

భీము : ఈ భూతము నాకంతధ్వని మంత్రమున గాని జయల్పడదు.

కం॥ భవదనుజు రక్తజలమున
చవి జూచితి నీ సమస్తసైన్యమహర్జి
చవి జూచితి నీ మదువు
చవిచీరగఁ ద్రిల్చి నీదు చవియుం జూతున్.

కం॥ స్వరము వినలేక నాయు
గ్రరూప మది తేరిచూడనాకను సమరా
కరమును వీడుచు క్రమలా
కరమును జొరదారి భ్రమకగా నెంచితివో ?

చం॥ జలమున మీనమట్లు జలజాకరమందున జొచ్చినాడ వా
చలి నిను బాధపెట్టు పెలుచఁ భవదీయ సుయోధనత్వమే
పొలపఱు చచ్చువారు మఱి పుట్టరె ? చీ : గదగొమ్ము కౌరవా
చలభిదురుండ భీముడను శత్రుబకోన్మథనుండ వచ్చితిఁ.

మ॥ హరిసంధానమునాడు జూపిన మహాహంకార మయ్యగ్నిజాం
బరకేళగ్రహణంబు సల్పి మద మప్పార్థాదులఁ బెద్ద మ
చ్చరముం బూని వనాళి ద్రిప్పు కుటిలోత్సాహంబు నేమయ్యెనో ?
కురువంశాధిప ! నేను భీముడ రణాకుంభోద్ధతిం బల్కెదఁ.

దుర్యో : (లేచి) ఏడీ భీముడు ?

భీముడు : కం॥ అనుజున్మ రక్తజలమున్
మును ద్రావగ వెఱచి ఇందు పుట్టిన నీవెం
టనె వచ్చిన యావీరుఁడు
ఘనశౌర్యుఁడు భీముఁడితఁడు కౌరవనాథా !

దుర్యో : పాంచాలీవరాభవదినమున ఈ గండుగర్వ మెందుండెనో ? షండా !

గీ॥ నాడు సీమలు చాటి బన్నములు బడుచు
కందమూలాశి భుజియించి కాననముల
నరగి యుండిరి నే డవియన్ని మఱచి
బిరుదుమగలట్లు మెలయుచు దిరుగ దగునె ?

గరిపెను, కాడను వదలి గదను ధరించి యుద్ధమొనర్చుట సాధ్యమా ?

కం॥ ఎసరిడి బియ్యము వార్చుట
వెస కంచము తొలచుటయును, వేగించుటయున్
సవియగు వంటలవానికి
వ్యసనం బిది ఎవఁడు సీకుఁ బట్టించెనొకో !

భీము : కం॥ వరసోదరసూనృత మా
దరమున నిలుపంగ వంటదాసుడ నైతిన్
కురువంశజ వినుమిక సీ
శరీర మాంసమును వండి శక్తుల కిడుదున్.

ధర్మరాజు : భీమా ! పగచే మున్ను వల్పిన అధర్మమును స్మరింపక నిర్మల క్షత్రధర్మమును స్మరింపుము. సుయోధనా !

గీ॥ సంగరంబేల ? వద్దుణాలి వగుము
భవ్యసంపన్మహా భోగ భాగి వగుము
ఇప్డు సీవేలు భూమియు, నెల్లి భూమి
భాగములు లేక కొని సుఖం వడగదయ్యా !

మ॥ ధరణీ వర్యము గొమ్ము పోవిడువుమా దాయత్వముఁ మమ్ము నే
వుర దాసుల్పలె నేలికొమ్ము గతముఁ పోద్రోయు మన్నింట సు
స్థిరతం బొందుము సాధుమార్గమున శాంతిఁ గీర్తి సాదించి సో
దరు డెట్ల ట్లువశాంతి గొమ్ము కురునాథా ! రాజచూడామణీ !

కృష్ణుడు : దుర్యోధనా ! ధర్మజుఁడు కృపచే హితమునే బల్కెను. ఇప్పుడైన విని బ్రతుకుము.

దుర్యో : కం॥ తానట : మర్యస్మఁడు మా
కొనట సహజీవనంబి : హరిహరి మతి సం
ధానమట : పందిమాటలం
నానాడే త్రెంచియుంటి నది తప్పెఱనే :

భీమా ఇవేమి మాటలు : రా, పోరుదము. చిరవాంఛిత మగు గదాయుద్ధము సాగింతము. చేయిగొట్టుము. (ద్వంద్వయుద్ధమగును)

దుర్యో : ఇది కణింగుని త్రిమింగిన దర్వమునకు.

భీము : ఇది లాక్షాగృహదహనమునకు.

దుర్యో : కురుబాలుని తిన్న రక్కసితనమునకు.

భీము : కృత్రిమనిషాన్నమునకు, మాయాజూదమునకు.

దుర్యో : దుశ్శాసను రక్తము త్రావిన పిశాచమునకు.

భీము : పాంచాలీప్రసంగమునకు.

దుర్యో : ఇది కర్ణునకు. (భీముడు క్రింద బడును)

కృష్ణు : భీముడు పడెను :

దుర్యో : ఇది ధర్మయుద్ధము. పడినవానిని కొట్టను. ఉంచు. గదాయుధపు గాలిచే నెచ్చరిక గొలిపెదను.

భీము : (తెలివిగొందుచు) పాంచాలీ. పాంచాలీ.

కృష్ణు : సత్యాక్రియా ! ఊరుభంగప్రతిజ్ఞ ఏమైనది :

దుర్యో : (తొడతట్టి) భంగమైనది :

(యుద్ధమగును. దుర్యోధనుఁడు పడును)

భీము : యాజ్ఞసేనీ : కొనవకులకాళరాత్రి :

ద్రౌపదీ : రా ! చూడు, రా ! ఊరుభంగమును, కీటభంగమును. (తమ్మును)

ధర్మరాజు : కూడదు, కూడదు. తమ్ముని, ఏకాదశాక్షోహిణీపతియగు రాజాధి రాజును పరాభవింపకూడదు. అకటా !

కం॥ కడగి తొడవిరిచి నెట్టన
పడవైచిన నేంగరిచి పడియును వసుధ
విడువ నమభంగి కులగిరి
పడినట్టిది విరిగి కౌరవప్రభుడు పడెఁ.

(దుర్యోధనుని సమాధానపరచును)

భీము : చూడుము. కనులార చూడుము యాజ్ఞసేనీ !

మ॥ చలముంబూని, విషంబొసంగి మటి లాక్షాగారముంగాల్చి భూ
తలముం జూదమునందు గెల్చి వలువల్ ధమ్మిల్ల మీడ్చించి దో
ర్బలమొప్పఁ బలుదాములం గుడుపు నా పాపాత్ము డాద్రోహి చం
చలు డానీచుడు క్రుంగినా డిచట నోచంద్రాస్య వీక్షింపుమా !

చం॥ ధరణిపు డిందు దీక్షితుఁడు తమ్ములు నల్వురు ఋత్విజుల్ రణా
ధ్వరవిధి యాజ్ఞికుం డల గదాధరు డాదృతసోమపీథినీ
చరితవు వీవు ప్రేరక మసహ్యపరాభవ మిందు కౌరవే
శ్వరు విటు వేల్చెదఁ బటుప్రభంగి నమర్షమహాగ్ని నగ్నిజా.

కం॥ సుహృత్తుఁడు కౌరవ్యక్ర
వ్యహవ్యమున నాయమర్షపావకు డీక డు
ర్వ్యహదుర్యోధనదేహ
ప్రహరణరక్తమున నా కవభృథం బయ్యెఁ.

పగదాయ మడినెను, ముడివేసికొమ్ము.

ద్రౌపది : అలవాటు దప్పి మఱచితిని. వగతుని మడియించిన నీవే ముడి వేయుము.

భీము : వేణీసంహారమైనది. స్మరనంజీవిని ద్రౌపది పూలు ముడిచికొన్నది. ఆహా శృంగారము ! విభ్రమము ! బెడంగు ! బింకము. ఇట్లుండవలదా నారీసౌందర్యము. ఈమె దరహాసవీక్షణముల సమరశ్రమయెల్ల దీరెను.

గీ॥ పదియు రెండేండ్ల కష్టముల్ భంగపాట్లు
ఘోరసంతాపమును గూర్చి తీరినంత
పుటములను బెట్టి తీసిన పొన్నువోలె
కనుల మిరిమిట్లు గొలిపె నీ కాంత యౌర !

ప్రియా, రమ్ము విడిదికి.

(భీముడు, ద్రౌపది పోదురు)

ధర్మ : కృష్ణా, కృష్ణా ! విజయోన్మత్తులు వీరు కానలేరు. నేను చూచితిని. భీముని తలపై ఆడుచున్న ఘోరమూర్తులను ; భ్రాతృహత్యామహాపాతకము లవి. చిరంజీవిని రక్షింపుము, రక్షింపుము.

కృష్ణ : నీ ధర్మమే రక్షించును. రమ్ము అందఱము నీలాచలమునకు పోయి, మహేశ్వరు నారాధించి వచ్చు బాధల నివారించికొందము. ఇప్పుడు కౌరవ లక్ష్మి మీదైవది. (పోదురు)

(లక్ష్మి దుర్యోధనుకడనుండి పోవుచుండును)

అశ్వత్థామ : భీష్ముడు చెప్పిన కొలనిదే యగును. కౌరవేశ్వరునిగూడి పాండవుల ధ్వంస మొనర్తును. ఎవరీమె ? సరోవరలక్ష్మియా ? నీ వెవ్వరివానవు ? ఎచ్చటినుండి వచ్చితివి ? ఎందుబోదువు ?

లక్ష్మి : చం॥ అమృతపయోధినిర్మథనమందు జనించితి నీరజాతగే
హముల వసింతు శౌరి యురమందు మెలంగు మహానుభావయౌ
కమలను నింతదాక కురుకాంతుని చెంగట నుంటి నిప్పు డు
త్తమపురుషోత్తమాజ్ఞలను దాలిచి పార్థుల చేర బోయెదఁ.

అశ్వత్థామ : పార్థుల జేర బోదువో, ఆ గోపాలునితో జేరి గోపికయైన మూఢురాలా !

గీ॥ పందయని పీఱఁదన్న విషలేక
పావనుఁడు, పాపియన్న విపషిలేక
తరుణుఁడని వృద్ధుడన్న భేదంబులేక
నెయ్యమున గొల్చు వీకంబె వీచులాండ్రె ?

కం॥ చంపింతువు సుతజనకుల
చంపింతువు చలముతోడ సహజమ్ములనూ
చంపింతువు గురుశిష్యుల
తెంపరి ! నీకంబె గ్రూరదేవత లాండ్రే ?

పార్థుల జేర బోయెదవో ?

కం॥ ఛీ ! మానుము ధర్మజుడట !
భీముండట, క్రీడి కవలా భీషణులంట ! పం
గ్రామమున వార లశ్వ
త్థామకు నాపోశనార్పిత స్నిలుతురొకో !

కం॥ వీ మురరిపుబలమును మా
భూమీశుని బలము నోవి ! పొరగందువులే
నీ మునుపటిపతి కురుపతి
గీముఁ తరలించి పంప కృష్ణుండెవడే ?

తొత్త ! నడువుము కౌరవేశ్వరుని కడకు. (లాగును)

లక్ష్మీ : కం॥ అచట నసురారి అనత
ఇచటఁ రుద్రావతారుఁ డీగతిలాగుఁ
అచట పులి ! ఇచట దరి ! ఇం
కెచటికి నే వేగవలెనొ ఎఱుగను కట్టా !

దుర్యో : (పలవరించును) మానభంగము, మానభంగము.

అశ్వ : కౌరవచక్రవర్తీ! ఇదేమి?

చం॥ తలపడి ఎవ్వ రాదుజగదంష్ట్రిక లూడ్చి? మృగేంద్రమూ ఁటా
వలిగొని కోరలఁ పెరికివైచె నెవండు? మదేభమూ ధరా
స్థలి బడగొట్టి దంతముల ఁార్చెనెవం? డిక పీ సురాద్రిని
శ్చలనిటిదోరు భేదనము పల్చిన దెవ్వాడు నాగకేతనా?

కం॥ హా! కురువంశమహాక్ష
త్రాకరకలహంస! హా! మహాద్యంతధరి
త్రీకాంత! హా! పణీంద్రప
తాకా! ఇటులాన్నె విధివిధానము వీక్ష్ణ!

ఉత్తరీయముచే ఈతల ధూళి తుడిచెడను.

దుర్యో! అశ్వత్థామా!

కం॥ అరివరణపాంసువుల పీ
పరిధానముచేత తుడిచివైవంగల వో
గురునందన నీవిటు నా
పరిభవపాంసువుల తొలచి వైపంగలవే?

అశ్వ : గీ॥ వన్ను వంచించి వచ్చి ఈ విన్నములకు
పాలుపడితివి కురుపతీ ప్రతియొవర్ప
ఁగోడుదువె ఇంక? ఇదిగో నా పీరముష్టి
నా మహోరక్తి, శక్తి ఎంతటివో గనుము.

దుర్యో : కం॥ హతదేహుఁడ హతభుజుఁడఁ
హతోరుఁడ హతమకుటుఁడను హతమతి నాకుఁ
ప్రతికార మొండు గలదే?
గతిసాధన యొండె ఇంక కర్తవ్యంబౌ.

అశ్వ : చెప్పుము చేసెదను.

దుర్యో : భీముని తల తెచ్చెదవా ? కన్నులార చూచి కొంతలేక చచ్చెదను.

అశ్వ : ఇదేమి గహనము : ప్రభువునకు నాకడపటి సేవ. నేను వచ్చువరకు ప్రాణము నిలిపియుంచుము. ఓసీ : లక్ష్మీ : చక్రవర్తికి చామరము వేయుచుండుము. (పోవును)

లక్ష్మీ : గీ॥ పట్టు కొనముట్టుదాకను పట్టె హతము
హతము విడువక తనపూర్వ్ నట్టె సేయ్పు
మీర సాగించె, జంకకు మేనుఱికిన
మాన డిత డెంత ఆత్మాభిమానధనుడొ ?

(అశ్వత్థామ ప్రవేశము)

అశ్వ : ఇదే కొనుము, నీ వాసించిన అయిదుగురు పాండవుల తలలు నీ కాలిపై నున్నవి.

దుర్యో : భీముడేడీ ?

చం॥ పవనజు మోముకా దతని వక్త్రము నన్గని మిన్నకుండునే
భువి ఱిడియుఁ ? దురాగ్రహము పొందుచు పోతి వెఱుంగవైతి పాం
డవుల శిరంబులే యివి ? కటా : ద్రుపదాత్మజ గర్భజోపపాం
డవ శిరముల్ వివేచన యొనర్పక ఈగతి తెచ్చినాడవే ?

కం॥ పరమేశ్వరావతారుఁడ :
వరమజ్ఞానీ : వివేకపతితునివలె బా
లురతలలు నరికి తెత్తువె
దొరకొను శిశుహననఘోరదోషము నీకుఁ.

ఇదంతయు కృష్ణనిమాయ. హరి, హరీ పొమ్ము. దీనికి ప్రాయశ్చిత్తము చేసికొమ్ము. దైవముముందు మనమెంత ? (చనిపోవును)

అశ్వ : నొచ్చిన జీవుఁడు చల్లబడెను. మహానుభావా : నీకు సుగతి యగుగాక : ఓసీ : విద్యున్మాలికాచంచలవగు రాజ్యలక్ష్మీ నీ వాధూర్తుల పాలగుము పొమ్ము. (లక్ష్మీ పోవును)

తపోవనమే నాకిక శరణ్యము. అదిగో సూర్యుడు వాలుచున్నాడు.

చం॥ కమలములార సుహృద్వదనకంజములార ముడువంగ నుగ్రతే
జము సమయగ కరంబులా విజిప్రభ బాయగ సర్వచక్రముల్
కుములగ నంబరంబు విడి క్షోణితలిం బడుచగ తమస్సమూ
హము బలియగ మహాకురుకులార్కుడు నర్కుడు నస్తమించిరే!

(తెర)

52

GSMBO1B147

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	OSMBD113147
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	1-8-24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	59
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	CI,2,12,14,52,53
లేని పేజీలు	NO
తయారు చేసినది	M.Navya
పేజీలు విడదీసినది	Rohit
స్కాన్ చేసినది	Aswini
పరీక్ష చేసినది	KASIMBI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good